

రేపు సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

తూప్రాన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు సాఫ్టుబాల్ జిల్లా క్రీడా జట్ల ఎంపిక చేస్తున్నట్లు సాఫ్టుబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణగుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి వరంగల్ పట్టణంలో నిర్వహించే 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఛాంపియన్‌షిప్, 26 నుంచి జరగనున్న బాలుర పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆయన వివరించారు.

టార్గెట్ లోకల్‌బాడీ

స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి

పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



గాంధీభవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

మెదక్/సంగారెడ్డి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని సత్తాచాటాలన్నారు. రాష్ట్రంలో పది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. తొందరలోనే డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రతీ మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలచిన ఆశావాహులు ప్రజల మద్దతు చూరగొనేలా పనిచేయాలని నిర్దేశించారు. సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథం, టీజీఐఐసీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మెదక్ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి నీలం మధు, పీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, జూలకంటి అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, అంజనేయులు, ఆవుల రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో డీఎస్సీ కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

మాస్టార్స్

లక్ష్యం పెట్టుకున్నారు.. కొలువు పట్టుకున్నారు

ఉపాధ్యాయ ఉద్యోగం వెనుక కఠోరశ్రమ

పట్టువదలని ప్రయత్నంతో విజేతలుగా..

జీవిత పరీక్షలో నెగ్గిన కార్యసాధకులు

పూర్తయిన డీఎస్సీ కౌన్సెలింగ్

'ఆంధ్రజ్యోతి'తో కొత్త టీచర్ల మాటముచ్చట

7

'ఉద్యోగాలు ఊరికే రావని... పక్కా ప్రణాళిక, కఠోర శ్రమ, నిరంతర అధ్యయనం, పట్టువదలని ప్రయత్నాలతోనే తమ లక్ష్యాన్ని సాకారం చేసుకున్నాం' అని అంటున్నారు ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన విజేతలు. బీఈడీ, డైట్ చదివి , టెట్ పరీక్షలో మార్కులు కూడబెట్టి డీఎస్సీలో నిరాశ ఎదురైనా వెనక్కి తగ్గలేదనిఅంటున్నారు. ఒకసారి విఫలమైతే ఇంకోసారి, మళ్లొకసారి, చివరిసారి అంటూ టార్గెట్లు పెట్టుకుంటూ గమ్యాన్ని చేరుకున్నామని గర్వంగా చెబుతున్నారు. ఓవైపు వయసు మీద పడుతోంది.. మరోవైపు కుటుంబపోషణ భారమవుతుంది.. అయినా కళ్లముందే లక్ష్యం ఊరిస్తుంది.. ఇక తాడోపేడో అంటూ తేల్చుకొని కొలువులు కొల్లగొట్టిన ఈ మాస్టార్లు నిజంగా స్టార్లుగా ప్రకాశించారు. వీరి జీవిత అనుభవాలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దబోయే విద్యార్థులకు పాఠాలు కానున్నాయి. పోస్టింగ్ ఆర్డర్లు అందుకోవడానికి మంగళవారం కౌన్సెలింగ్‌కు హాజరైన కొత్త టీచర్లతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించారు..

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్‌అర్బన్/సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

తొలుత వాయిదా.. తర్వాత చకచకా

సంగారెడ్డిలో 391, మెదక్ జిల్లాలో 269 మంది కొత్త టీచర్ల నియామకం

తీరనున్న ఉపాధ్యాయుల కొరత

గతంలో బదిలీ అయినవారు రిలీవ్

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 అభ్యర్థులకు మంగళవారం సంగారెడ్డిలోని జడ్పీహాల్‌లో, మెదక్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. కేటాయించిన పాఠశాలల్లో నేడు విధుల్లో చేరనున్నారు. మంగళవారం కౌన్సెలింగ్ ఉంటుందని విద్యాశాఖ అధికారులు సమాచారం ఇవ్వడంతో అభ్యర్థులు ఉదయం 9 గంటలకే జడ్పీహాల్‌కు చేరుకున్నారు. ఇంతలోనే కౌన్సెలింగ్ నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు ప్రకటించడంతో గందరగోళం నెలకొన్నది. అభ్యర్థులంతా ఒక్కసారిగా నిరాశతో వెనుదిరిగారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని పైనుంచి ఆదేశాల రావడంతో అధికారులను అభ్యర్థులకు ఫోన్లు చేసి పిలిపించారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ చకచకా నిర్వహించారు. సంగారెడ్డిలో 391 మంది అభ్యర్థులకు పాఠశాలలను కేటాయిస్తూ కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందజేశారు.

మెదక్ జిల్లాలో ముగ్గురికి నో పోస్టింగ్

మెదక్ జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించారు. జిల్లాలో 272 మంది డీఎస్సీలో ఎంపిక కాగా.. అనివార్య కారణాలతో ముగ్గురి పోస్టింగ్స్ పక్కన పెట్టినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. జిల్లాలో 269 మంది కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

వారందరికీ రిలీఫ్

ఇటీవల జరిగిన టీచర్ల బదిలీ ప్రక్రియలో టీచర్లు బదిలీ అయినప్పటికీ.. వారి స్థానాల్లో కొత్తగా ఎవరూ రాకపోవడంతో చాలా మంది పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం కొత్తవారు రావడంతో జిల్లాలో 389 మంది రిలీవ్ కానున్నారు. వారంతా తాము బదిలీ అయిన స్థానాల్లో నేడు రిపోర్ట్ చేయనున్నారు.

గాలివాన బీభత్సం

వందలాది ఎకరాల్లో నేలకొరిగిన వరి పొలాలు

శివంపేట, చక్రియాల గ్రామాల్లో భారీగా పంట నష్టం

7



చక్రియాల్‌లో నేలకొరిగిన వరి

టేబుల్ టెన్నిస్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

7

'గీతం'లో మాస్టర్ చెఫ్ పోటీలు

పాకశాస్త్ర కళకు లింగ భేదం లేదు

మాస్టర్ చెఫ్ పోటీల్లో నిపుణులు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్.. ఖేడ్‌కు వరం

రూ. 125 కోట్లతో భవన నిర్మాణం

2,500 మంది విద్యార్థులు..

120 మంది అధ్యాపకులు

నేడు మంత్రిచే శంకుస్థాపన

8



తొలిమంచు కురిసింది

సంగారెడ్డి పట్టణాన్ని మంచుతెర కమ్మేసింది. మంగళవారం ఉదయం 8 గంటలు దాటినా పొగమంచు ప్రభావం కనిపించింది. పైన మంచు తెర.. కింద చెరువు నీరు.. దూరంగా బహుళ అంతస్థుల భవనాలు కనిపిస్తున్న దృశ్యం చూపరులను ఆకట్టుకున్నది.

-సంగారెడ్డి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

కోలుకుంటున్న సంజీవన్‌రావుపేట

● పరిస్థితి అదుపులోకి ● సమస్యలు తెలుసుకునేందుకు గ్రామసభ

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటిని తాగి 50 మంది అస్వస్థతకు గురైన ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో పరిస్థితి మంగళవారం అదుపులోకి వచ్చింది. ముగ్గురు స్వల్ప అస్వస్థతతో గ్రామంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపులో చేరారని క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ రాజేశ్వర్ తెలిపారు. సంగారెడ్డిలోని ప్రైవేటు వైద్యశాలలో చేరిన ముగ్గురిలో ఇద్దరు, ప్రభుత్వ వైద్యశాలలో చేరిన ఆరుగురిలో ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ఖేడ్ ఏరియా వైద్యశాలలో సోమవారం ఇరువురు, మంగళవారం ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారని, 13 మంది చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

సంజీవన్‌రావుపేట సెక్రటరీగా సుభాష్

సంజీవన్‌రావుపేట పంచాయతీ సెక్రటరీగా సుభాష్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామంలో కలుషిత నీటి వల్ల 50 మంది అస్వస్థతకు గురికావడంతో ఇరువురి ఏఈలను, కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఎంపీవోకు, గ్రామ ప్రత్యేకాధికారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సంజీవన్‌రావుపేటలోని పరిస్థితులపై తహసీల్దార్ భాస్కర్, డీఎల్పీవో సంజీవరెడ్డి, ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గ్రామసభ నిర్వహించారు.

సమస్యలపై రాజకీయాలు తగవు: ఎమ్మెల్యే

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై రాజకీయాలు తగవని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంజీవన్ రావుపేట ఘటన తెలుసుకుని తక్షణమే గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేయించామన్నారు. అయినా కొందరు రాజకీయం చేయడం చేయడం సరికాదన్నారు.



నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న సంజీవన్‌రావుపేట గ్రామస్థులు

అవసరం రూ.60 కోట్లు.. వచ్చింది రూ.5.93 కోట్లు

పంచాయతీలకు ఎస్‌ఎఫ్‌సీ నిధుల మంజూరు

4 నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు బకాయి

ట్రాక్టర్ వాయిదాలు, విద్యుత్ బిల్లులు, వేతనాల చెల్లింపులకు కటకట



ఎల్లాపూర్ గ్రామపంచాయతీ భవనం

మెదక్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లెసీమలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పారిశుధ్య చర్యలు తీసుకోవడం ప్రత్యేకాధికారులకు సాధ్యపడడం లేదు. పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా వేతనాలు లేవు. పదినెలలుగా గ్రామ పంచాయతీలకు ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. ఒక్క ఆగస్టులో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఒకనెల నిధులు రూ.6 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత మళ్లీ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి జిల్లాకు రూ.60 కోట్లు అవసరం కాగా.. కేవలం రూ.5.93 కోట్లు విడుదలయ్యాయి. వీటిని గ్రామ పంచాయతీలకు చెందిన ట్రాక్టర్ వాయిదాలు, విద్యుత్ బిల్లులు, వేతనాల చెల్లింపులకు వినియోగిస్తున్నారు. ఫిబ్రవరిలో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామాల్లో ఏ పని చేపట్టాలన్నా పంచాయతీ కార్యదర్శులే ముందుండి నడుపుతున్నారు. ఏడాదిగా ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదల కావడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం కింద పంచాయతీల్లో కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ట్రాక్టర్ నిర్వహణ, నీళ్ల ట్యాంకులు శుభ్ర పర్చడానికి వినియోగించే బ్లీచింగ్ పౌడర్, నీటి సరఫరాకు సింగిల్ ఫేజ్ మోటార్లు అమర్చడంతో పాటు పారిశుధ్య కార్మికులకు కొంతమేర చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం ఒకనెల ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడంతో కాస్త ఊరట లభించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా పచ్చదనం, స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించినా నిధుల కొరతతో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు నామమాత్రంగానే జరిపారు. పల్లెల్లో నెలకొనే సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. గ్రామాల్లో తరచూ తాగునీటి బోరు మోటార్లు కాలిపోవడం, పైప్‌లైన్ల, వాటర్ ప్లాంట్ల మరమ్మతులు, పారిశుధ్యం తదితర పనులు చేయాల్సి వస్తోంది. నిధుల కొరత ఉన్నా.. ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో అప్పులు చేసి పనులు చేయిస్తున్నారు.



తూప్రాన్‌లో ఆందోళన చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది

ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలు బంద్

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విద్యార్థులు, కళాశాల సిబ్బంది ర్యాలీలు

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/తూప్రాన్/రామాయంపేట/అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలు బంద్ పాటించాయి. మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయాలని నిర్ణయించాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో స్ఫూర్తి డిగ్రీ కళాశాల యాజమాన్యం కళాశాలను బంద్ చేసి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించింది. జిల్లాలో 2021 నుంచి సుమారు రూ.2 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని విద్యాసంస్థ ప్రతినిధులు చెప్పారు. జహీరాబాద్, తూప్రాన్, రామాయంపేటలోనూ పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ఆందోళనలు చేపట్టారు. రామాయంపేటలో స్నేహ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ రోజుకో రూపంలో నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

అటెండర్ నుంచి డీఈ వరకు..

2 డివిజన్ల పరిధిలో 158 మంది..

మెదక్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ సర్కిల్ పరిధి విద్యుత్‌శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అటెండర్ మొదలుకొని డీఈ వరకు 158 మందికి స్థానచలనం జరిగింది. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఉన్న డీఈలు, ఏడీలు, ఏఈలను కార్పొరేట్ ఆఫీస్ పరిధిలో సీఎండీ బదిలీ చేయగా.. ఓఅండ్ఎం స్టాఫ్‌ను డివిజన్‌స్థాయిలో ఎస్ఈ, డీఈలు బదిలీ చేశారు. జిల్లాలోని మెదక్, తూప్రాన్ డివిజన్ల పరిధిలో డీఈలు 4, ఏడీలు 6, ఏఈలు 8, సబ్‌ఇంజనీర్లు 20, లైన్‌మెన్లు, ఫోర్త్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, అకౌంట్స్ సిబ్బంది మొత్తం 158 మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారు. ఈ బదిలీలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. మెదక్ ఆపరేషన్స్ డీఈ కృష్ణారావు కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన చాంద్‌షరీఫ్ పాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

సయ్యద్‌నగర్ టు గల్ఫ్

ఆ గ్రామం నుంచి ఇంటికొకరుగా పయనం

ఉన్న ఊరిలో బతుకుదెరువు లేక అరబ్ దేశాలకు..


ప్రస్తుతం వివిధ దేశాల్లో ఓ మహిళతో సహా 70 మంది

నామమాత్రపు వేతనాలకు గల్ఫ్ దేశాల్లో మగ్గుతున్న సయ్యద్‌నగర్ వాసులు

7







శాంపిల్స్ సన్న బియ్యం.. సంచుల్లో దొడ్డు బియ్యం..

- గ్రామంలో తిరుగుతూ విక్రయం
- మోసానికి గురైనట్లు గుర్తించి

బాధితుడి ఆవేదన

హత్నూర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ సంపాదించాలన్న దుర్బుద్ధి. సామాన్య వ్యక్తులను ఎంచుకుని... సన్న బియ్యం శాంపిల్స్ చూపించి... సంచుల్లో దొడ్డు బియ్యం ఉంచి నయా మోసానికి ఒడిగట్టాడు ఓ ప్రబుద్ధుడు.. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన బాధితుడు పొట్లగల బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి తాము గ్రామాలు తిరుగుతూ నెంబర్ వన్ కర్నూల్ సన్న బియ్యం అమ్ముతున్నామని నమ్మించాడు. అంతేకాకుండా ఆవ్యక్తి తన స్కూటీపై శాంపిల్ చూపించడం కోసం తీసుకువచ్చిన 25 కిలోల సన్నబియ్యం బస్తా తెరిచి అందులో నుంచి సన్న బియ్యం చూపించి క్వింటాల్‌కు రూ.5,600ల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపాడు. గ్రామ సమీపంలో డీసీఎం నిలిపి ఆర్డర్లు సేకరిస్తున్నట్లు నమ్మ బలికాడు. దీంతో బాధితుడు తనకు క్వింటాల్ 25 కిలోల సన్నబియ్యం కావాలని చెప్పడంతో వెంటనే స్కూటీపై 25 కిలోల చొప్పున 5 బస్తాలు ఉన్నాయని నమ్మించి బాధితుడి నుంచి రూ.6,300 తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తాను కొనుగోలు చేసిన సన్న బియ్యం బస్తా మంగళవారం ఉదయం తెరిచి చూసేసరికి దొడ్డు బియ్యం ఉన్నాయి. అనుమానం వచ్చి మిగతా బస్తాలను తెరిచి చూడగా అన్నింట్లో దొడ్డు బియ్యం ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా 25 కిలోలకు బదులు ఒక్కో బస్తా 20 కిలోలు మాత్రమే ఉండటంతో తాను మోసపోయినట్లు బాలయ్య గుర్తించాడు. నెంబర్ వన్ కర్నూలు సన్నబియ్యం బ్రాండెడ్ లేబుల్ బస్తాలు ఉండటంతో తాను కొనుగోలు చేశానని, తెరిచి చూస్తే నాసిరకం దొడ్డు బియ్యం ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న ఇలాంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.



కోర్టును పరిశీలించిన జిల్లా సబ్ జడ్జి జితేందర్

అల్లాదుర్గం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభంకానున్న అల్లాదుర్గం సివిల్ కోర్టు నూతన భవనాన్ని జిల్లా సబ్ జడ్జి జితేందర్ మంగళవారం పరిశీలించారు. తాత్కాలికంగా స్థానిక వసతి గృహంలో ఏర్పాటుకానున్న ఈ కోర్టును ఏప్రిల్ 3న జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద సందర్శించి, వీటి పనులను పరిశీలించారు. కాగా ఈ కోర్టు ప్రారంభానికి సిద్ధం కావడంతో మరోమారు జిల్లా సబ్ జడ్జి జితేందర్, మెదక్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ భవనాన్ని పరిశీలించారు.

అవుట్‌సోర్సింగ్ ఏవోలను ఇబ్బంది పెట్టొద్దు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ బుకింగ్ చేయని అవుట్‌సోర్సింగ్ ఏవోలను విధుల నుంచి తప్పిస్తామని ఫోన్‌చేసి ఒత్తిడి చేయొద్దని అవుట్‌సోర్సింగ్ ఏఈవోలు మంగళవారం ఇన్‌చార్జి డీఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో, ఉద్యోగ భద్రత లేకపోయినా, వేతనం కాకున్నా విధులు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులర్ ఏఈవోలతో సమానమైన పని చేస్తున్నా జీతం సమయానికి అందని పరిస్థితి అని వాపోయారు. డిజిటల్ క్రాప్ విషయంలో రెగ్యులర్ ఏఈవోలు ససేమిరా అనడంతో అవుట్‌సోర్సింగ్ ఏఈవో చేయాల్సిందేనంటూ ఒత్తిడి చేయొద్దని తెలిపారు. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి నేరుగా ప్రభుత్వం ద్వారానే ప్రతినెల జీతం వేయాలన్నారు.















సయ్యద్‌నగర్ టు గల్ఫ్



గ్రామ ముఖచిత్రం

- ఒకే గ్రామం నుంచి వంద మందికిపైగా వలస
- ఉన్న ఊరిలో బతుకుదెరువు లేక అరబ్ దేశాలకు పయనం
- ప్రస్తుతం వివిధ దేశాల్లో ఓ మహిళతో సహా డెబ్బై మంది
- నామమాత్రపు వేతనాలకు గల్ఫ్ దేశాల్లో మగ్గుతున్న సయ్యద్‌నగర్ వాసులు

రాయపోల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : అదో మారుమూల పల్లెటూరు. ఆ గ్రామంలో వందకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఊరిలో బతుకుదెరువు లేక గల్ఫ్ బాట పట్టారు. దాదాపు ఇంటికొక్కరు ఏడారి దేశాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఉన్న ఊరిని.. కన్న వాళ్లను.. భార్య పిల్లలను వదిలి ఏళ్లుగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ గ్రామమే సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని సయ్యద్‌నగర్.

చుట్టూ అడవీ.. వ్యవసాయం అంతంతే..

సయ్యద్‌నగర్‌లో 120కిపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో 500 వరకు జనాభా ఉన్నది. గ్రామం చుట్టుపక్కల అటవీ ప్రాంతం కావడంతో అక్కడ వ్యవసాయం అంతంత మాత్రమే. కేవలం బండపై రాళ్లను కొట్టి విక్రయించి జీవిస్తూ ఉంటారు. ఆ పని కూడా అంతంత మాత్రమే కావడంతో వారికి సరైన ఉపాధి కరువైంది. కుటుంబాలను పోషించడం తలకు మించిన భారంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో గ్రామంలోని వారు ఒక్కొక్కరుగా అరబ్ దేశాలకు వలస పట్టారు. 30 ఏళ్లుగా ఆ గ్రామం నుంచి గల్ఫ్‌కు వలసలు కొనసాగుతున్నాయి. వారి దయనీయ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ఏజెంట్లు వీసాలు ఇప్పిస్తాం, పని చూపిస్తామంటూ అందినకాడికి దోచుకున్నారు. ఒక్కొక్కరి దగ్గర లక్షల రూపాయలు వసూలు చేసి దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఖతర్, ఓమన్ తదితర అరబ్ దేశాలకు పంపించడం ప్రారంభించారు.

గల్ఫ్‌లో గొడ్డు చాకిరి

గల్ఫ్‌కు వెళ్లిన తర్వాత అక్కడి యజమానులు వీరితో గొర్రెలు, ఒంటెలు కాయించడం, నిర్మాణ పనుల్లో రోజుకు సుమారు 12 గంటల పాటు గొడ్డు చాకిరి చేయిస్తున్నారు. అంత కష్టపడినా వీరికి వచ్చే జీతాలు నామమాత్రమే. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా వేతనాలు ఉన్నాయి. నెలకు రూ.20 వేల వరకే సంపాదిస్తూ అరబ్ దేశాల్లో ఆగమవుతున్నారు. అది కూడా సమయానికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురవుతున్న వారు ఉన్నారు. సయ్యద్‌నగర్ నుంచి ఇప్పటివరకు 100 మందికిపైగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఇందులో పలువురు తిరిగి రాగా, ఇంకా 70 మంది వరకు అక్కడే పనిచేస్తూ ఉన్నారు. ఏడాది క్రితం ఇద్దరు మహిళలు ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లి ఇళ్లల్లో పనిచేశారు. ఇటీవల ఓ మహిళ తిరిగి రాగా ఇంకొకరు అక్కడే పనిచేస్తున్నది. అక్కడ పనిని తట్టుకోలేక కొందరు, ఆరోగ్యం సహకరించక మరికొందరు తిరిగి వచ్చారు. అప్పు చేసి వెళ్లిన కొన్ని రోజులకే తిరిగి రావడంతో మరింత అప్పుల పాలయ్యారు. తమకు ఉపాధి కల్పిస్తే గల్ఫ్ బాధలు తప్పుతాయని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అక్కడ చెప్పిన పని చేయాల్సిందే



నేను ఏడేళ్ల పాటు సౌదీ అరేబియాలో పనిచేశాను. అక్కడ వాళ్లు చెప్పిన పని చేయాల్సి ఉంటుంది. కష్టమైనా భరించాల్సిందే. నేను డ్రైవర్‌ను అయినప్పటికీ మొదట్లో నాతో గొర్రెలకు గడ్డి కోయించారు. కొన్ని రోజుల తర్వాత కారు డ్రైవర్‌గా పనిచేశాను. మన కరెన్సీలో నెలకు రూ.20 వేల వరకు వేతనం వచ్చేది.

\- ఎండీ గౌస్, సయ్యద్‌నగర్

అరబ్ దేశానికి వెళ్లి అప్పులపాలయ్యా..



నేను సౌదీ అరేబియాకు వెళ్లగా అక్కడ నాతో ఒంటెలను కాయించారు. అక్కడ యజమానులు సరైన ఆహారం పెట్టకపోవడంతో నా లివర్ దెబ్బతిన్నది. అక్కడనే ప్రభుత్వాసుపత్రిలో ఆరు నెలల పాటు చికిత్స చేయించుకుని తిరిగి వచ్చాను. కొంచెం నయం అయిన తర్వాత వెళ్లగా మళ్లీ ఆరోగ్యం దెబ్బతిన్నది. ఇలా సౌదీ అరేబియా వెళ్లడానికి నాకు లక్షల్లో ఖర్చు అయింది. తరచూ ఆరోగ్యం దెబ్బతినడంతో అప్పుల పాలై తిరిగి వచ్చి బండ కొట్టుకుంటూ జీవిస్తున్నాను.

\- ఎండీ హుస్సేన్, సయ్యద్‌నగర్

క్రైం కార్నర్

బైకును ఢీ కొట్టిన కారు.. ఒకరి మృతి



మృతి చెందిన మల్లేశం

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బైకును కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల మల్లేశం(45) సోమవారం రాత్రి బైకుపై రాజీవ్ రహదారిపై గ్రామంలోని మీసేవ వద్ద రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బైకు గేదెను ఢీకొట్టి వ్యక్తి..



నాగులు(ఫైల్)

చేగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బైకు గేదెను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం బోనాల గ్రామ శివారులో సోమవారం చోటుచెసుకుంది. ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్రబోయిన నాగులు(56) అన్న కుమారుడు మల్లేశంతో కలిసి బైకుపై శివాయపల్లిలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా బోనాల గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న గేదెను బైకు బలంగా ఢీకొట్టింది. వెనుక కూర్చున్న నాగులు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

పరువు పోయిందని మహిళ బలవన్మరణం



యాదమ్మ మృత దేహం

చిన్నశంకరంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి విభూతి యాదమ్మ (40)తో రెండు రోజుల క్రితం ఓవ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మృతురాలి భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ గౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

గజ్వేల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జూపల్లి అంసమ్మ(45) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి కొండపోచమ్మ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు అంసమ్మ మృతేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న వారు అంసమ్మ మృతదేహాన్ని వెలికి తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలపై డిప్యూటీ తహసీల్దార్లకు శిక్షణ

తూప్రాన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శిక్షణలో ప్రసంగిస్తూ ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ దరఖాస్తులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ పూర్తి చేసి ఈఆర్వో లాగిన్‌కి ఫార్వర్డ్ చేయాలని సూచించారు. గత ఆరేళ్లలో కనీసం మూడేళ్లు సెకండరీ స్థాయి కంటే పైస్థాయి ప్రభుత్వ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు ఫారం 19 ద్వారా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. 2021 నవంబరు కంటే ముందు పట్టభద్రులైన వారు ఫారం 18 ద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీల ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకునే వారు ఎక్కడ పని చేస్తున్నా స్థానికంగా నివాసం ఉన్నవారై ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నవంబరు 6 వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. పురుషుల విభాగంలో నరేష్ (మిరుదొడ్డి), రవితేజ (కూచన్‌పలి), అనీష్(నర్సన), జూనియర్ బాలుర విభాగంలో నవీన్(సంగారెడ్డి), నరేష్(మెదక్), సాయిసంగమేశ్వర్(సంగారెడ్డి), బాలికల విభాగంలో కౌశిక(మెదక్), రేవతి(కూచన్‌పల్లి), నవ్య(కూచన్‌పల్లి), సబ్ జూనియర్ బాలుర విభాగంలో వర్షిత్(కూచన్‌పల్లి), మహేంద్ర(కూచన్‌పల్లి), ప్రణయ్‌రాజ్(మెదక్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. కొక్కొండ ప్రభు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ శ్యాంరావు, రిటైర్డ్ పీడీ ఆనందం, సంఘ సభ్యులు హనుమంతు, రవితేజ, అనీష్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రెసిడెంట్ డైరెక్టర్ వర్మ

పాకశాస్త్ర కళకు లింగ భేదం లేదు

● మాస్టర్ చెఫ్ పోటీలలో నిపుణుల స్పష్టీకరణ

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాకశాస్త్ర కళకు లింగ భేదం లేదని, వంట చేయడం ఒక నైపుణ్యమని, స్త్రీ- పురుష భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ అది అవసరమేనని వక్తలు స్పష్టీకరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్-లోని కుకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'మాస్టర్ చెఫ్' పోటీలను ఆద్యంతం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గీతం ఆతిథ్య విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాకశాస్త్ర కళల గురించి అవగాహన కల్పించాట. ఈ పోటీలలో పాల్గొన్న వారు కేవలం వంటకాల రుచిపై మాత్రమే కాకుండా, వారిలోని సృజనాత్మకత, పోషకాహార పరిజ్ఞానాలను కూడా ప్రదర్శించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రధాన చెఫ్, ఆతిథ్య విభాగం సిబ్బంది ఉల్లాసభరితమైన, ఆకర్షణీయమైన వాతావరణాన్ని పెంపొందించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించారు.

విద్యుదాఘాతంతో అన్నదాత మృతి

- బిందు సేద్యం ద్వారా పంటకు నీరందించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం
- తొగుట మండలం గుడికందులలో ఘటన



గురువారెడ్డి(ఫైల్)

తొగుట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం గుడికందుల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గోరిట గురువారెడ్డి(42)కి గ్రామంలో 5 ఎకరాల 13 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట సాగు చేసి ఇటీవల కోత కూడా పూర్తిచేశాడు. మరోమారు అదే భూమిని చదును చేసి 3 ఎకరాల్లో మళ్లీ మొక్కజొన్న పంట, మిగతా రెండు ఎకరాలపైచిలుకు పొద్దుతిరుగుడు పంట సాగుచేశాడు. విత్తనాలు మొలకెత్తడానికి బిందు సేద్యంతో స్ప్రింక్లర్లను ఉపయోగించి నీరు పారించేందుకు మంగళవారం యత్నించాడు. వ్యవసాయ భూమి పైనుంచి 11కేవీ విద్యుత్ వైర్లు చేతికందే దశలో ఉన్నాయి. అది గమనించని రైతు స్ప్రింక్లర్ పైపులను బిగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇనుప పైపులు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య రమాదేవి, కుమారుడు లోకేశ్‌రెడ్డి, కూతురు ఆకాంక్ష ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు తెలిపారు.



సిద్దిపేటలో నియామకపత్రం అందుకుంటున్న కొత్త టీచర్

మా స్టార్స్

ఆస్పత్రిలో బెడ్ పక్కన ఉండి చదువుకున్నా..



13 సంవత్సరాల కల నెరవేరింది. నేను ఇంటర్మీడియట్ నుంచి పనిచేస్తూనే చదువుకున్నా, డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో పూర్తిచేశాను. 13 సంవత్సరాలుగా ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేశాను. మా అమ్మకు అనారోగ్యం కారణంగా చాలా సార్లు హాస్పటల్‌లో అడ్మిట్ కావాల్సి వచ్చింది. అప్పుడు మా అమ్మ బెడ్ పక్కన ఉంటూ చదువుకున్నాను. పట్టుదలతో ఉద్యోగం సాధించాను. దౌల్తాబాద్ హిందీ పండిట్‌గా పోస్టింగ్ వచ్చింది.

\-సల్మా సయ్యద్, శంకర్‌నగర్ సిద్దిపేట

సమయం దొరికినప్పుడల్లా చదివా...



2012 నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటివరకు 3 సార్లు డీఎస్సీ రాశాను. పిల్లలు పుట్టకముందు వరకు ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేశాను. పని ఒత్తిడి ఎక్కువ.. జీతం తక్కువగా ఉండేది. చేస్తే ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే చేయాలని నిర్ణయించుకున్నాను. కుటుంబాన్ని, పిల్లలను చూసుకుంటూ సమయం దొరికినప్పుడల్లా ప్రిపేర్ అయ్యాను. సిద్దిపేట కాళ్లకుంట కాలనీ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.

\- వీరబత్తిని రజిని, నర్సాపూర్ సిద్దిపేట

వ్యవసాయం చేస్తూ పరీక్షకు సన్నద్ధమయ్యా..



మూడు సంవత్సారాలుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాను. మా గ్రామంలోనే ఉంటూ ఓ వైపు వ్యవసాయం పనులు చేసుకుంటూనే మరోవైపు పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. ఏదేమైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో ముందుకెళ్లాను. సొంతగా ప్రణాళిక సిద్ధం చేసుకుని చదవడంతోనే నా లక్ష్యాన్ని చేరుకోగలిగాను. దుబ్బాక ప్రభుత్వ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.

\-గుండెల్లి కుమారస్వామి, లక్ష్మీదేవిపల్లి

పగలు ఉద్యోగం.. రాత్రుల్లో చదువు...



2017 డీఎస్సీలోనే కొద్దిలో ఉద్యోగం మిస్ అయ్యాను. అయినా నిరాశ చెందకుండా ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రిపరేషన్ కొనసాగించాను. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పనిచేస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను. పగలు ఉద్యోగ విధుల్లో బిజీగా ఉండడంతో ఎక్కువగా రాత్రి పూట మేల్కొని చదివాను.

\-హిమబిందు, స్కూల్ అసిస్టెంట్, సదాశివపేట

2017లోనే వస్తుందనుకున్నా..



2017లోనే వస్తుందని ఆశించినా ఫలితం దక్కలేదు. అప్పటినుంచి నోటిఫికేషన్ రాకపోయినా ప్రిపరేషన్ మాత్రం ఆపలేదు. సొంత ఊరు, తల్లిదండ్రులకు దూరంగా హైదరాబాద్‌లో రూమ్ తీసుకొని చదివాను.

\-సీ.హెచ్.రాజు, ఎస్జీటీ, తుర్కవడగామ, కంగ్టి మండలం

పబ్లిక్ లైబ్రరీలోనే చదివా..



సంగారెడ్డి లైబ్రరీలోనే చదివి టీచర్ ఉద్యోగం సాధించాను. రెండేళ్ల నుంచి కష్టపడ్డాను. 2017లో ఉద్యోగం రాలేదనే చింతించకుండా ఇంకా కష్టపడి చదివాను. ఎట్టకేలకు ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది.

\-కె.చైతన్య, ఎస్జీటీ, మారెపల్లి, కొండాపూర్

44 ఏళ్లకు సాధించా..



వరుసగా డీఎస్సీ రాసినా ప్రతి సారి స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయాను. ఆఖరి ప్రయత్నంగా 2024 డీఎస్సీలో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నేను ఇంటికి పెద్దవాడిని కావడంతో తండ్రి తర్వాత బరువు బాధ్యతలన్నీ తీసుకున్నాను. 21 ఏళ్లుగా ప్రైవేటు లెక్చరర్‌గా పని చేశాను. పట్టుదలతో చదివి ప్రస్తుతం 44 ఏళ్ల వయస్సులో నా జీవిత లక్ష్యాన్ని చేరుకున్నాను.

\-మహేష్, కొత్తపల్లి, పాపన్నపేట మండలం

108లో పని చేశాను..



పలుమార్లు డీఎస్సీ రాసిన స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం పొందే అవకాశాన్ని కోల్పోయాను. అయినా వెనక్కి తగ్గకుండా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కష్టపడి చదివాను. 16 ఏళ్ల పాటు 108లో పని చేస్తూనే పరీక్ష సిద్ధమయ్యాను. ప్రస్తుతం జిల్లాలోనే 2 ర్యాంకు సాధించి తెలుగు పండిట్‌గా ఉద్యోగం సాధించాను.

\-పసుల మల్లికార్జున్, రంగంపేట, కొల్చారం మండలం

రెండో ప్రయత్నంలో సాధించాం..



మేము 2018లో వివాహం చేసుకున్నాం. అప్పటికే బీఈడీ పూర్తి చేసి, 2017లో ఇద్దరం డీఎస్సీ రాసినప్పటికీ ఉద్యోగం రాలేదు. మరింత పట్టుదలతో చదివి 2024 డీఎస్సీ రాశాం. ఎస్జీటీలో 42, 65 ర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించాం. చాలా సంతోషంగా ఉంది.

\- శేఖులు, స్వప్న దంపతులు, కొంగోడ్ గ్రామం, కొల్చారం మండలం

'ఉపాధి' కోసం గ్రామ సభలు

● సంగారెడ్డి అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్

జహీరాబాద్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : నవంబరు 30 వరకు గ్రామసభలు నిర్వహించి పనుల ఎంపికను చేపట్టాలని సంగారెడ్డి అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్‌లోని జహీరాబాద్,మొగుడంపల్లి, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంఠ ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామాలవారీగా పనులను ఎంపిక చేయాలన్నారు. ముందుందు ప్రజల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా ఎంపిక ప్రక్రియ సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు అశోక్‌కుమార్, రాజ్‌కుమార్, సునందరావు, రంగారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్ తదితరులు

నీటి సరఫరాపై సహాయకులకు శిక్షణ

● మిషన్‌భగీరథ ఈఈ షేక్‌పాషా

కొండాపూర్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామలలో ఇంటింటికీ నీటి సరఫరాపై నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు మిషన్ భగీరథ నీటి సరఫరా ఈఈ షేక్ పాషా తెలిపారు. మంగళవారం కొండాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ (వాటర్ మ్యాన్) తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులకు ఈఈ హాజరై మాట్లాడారు. మొదటి రోజు సింగల్, త్రీ ఫేస్ ఆన్ ఆఫ్, రిపేర్, రెండవ రోజు హ్యాండ్ పంపు, మూడవ రోజు పైపు జాయింట్లు, నల్లా కనెక్షన్ ఇవ్వడంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చివరి రోజు నీటి నాణ్యత తెలిపే పరిక్షలపై చర్చ ఉంటుందన్నారు. ఈ శిక్షణ ద్వారా గ్రామల్లో ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ సూచరిత, ఏఈ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ల్యాబ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.


గాలివాన బీభత్సం

- వందలాది ఎకరాల్లో నేలకొరిగిన వరి పైరు
- శివంపేట, చక్రియాల గ్రామాల రైతులకు తీరని నష్టం

పుల్‌కల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రానికి చల్లబడింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటపాటు వర్షం కురిసింది. మరో పక్షం, నెల రోజుల వ్యవధిలో కోతకు వస్తుందనుకున్న వరి పంట నేలపాలైంది. వందలాది ఎకరాల్లో వరి పైరు దెబ్బతినడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

పుల్కల్ మండలం కోడూరులో విషాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన తలారి రాహుల్ వంశీ (22) సోమవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. భారీ వర్షం కురుస్తూ ఒక్కసారిగా పిడుగుపడడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్ద వెతకగా రాహుల్ వంశీ మృతదేహం కనిపించింది. మృతుడి కుటుంబాన్ని అన్నీ విధాల ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చక్రియాల గ్రామంలో నేలకొరిగిన వరి పంట

-= సంక్షిప్తం =-

మహారాష్ట్ర ఎన్నికల సమీక్షలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



నారాయణఖేడ్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరుగనున్న ఎన్నికల సమీక్ష సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. మంగళవారం ముంబై లోని తిలక్‌భవన్‌లో మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ చనితాల ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో నాందేడ్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కూడా పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని బాలసదన్‌లో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలని సూచించారు.

ఈ నెల 29 వరకు విదేశీ విద్య దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో విద్యనభ్యసించేందుకు దరఖాస్తు గడువును ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు బొల్లారం పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ పారిశ్రామికవాడలో ఈ నెల 16న విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 3వ ఫీడర్ పరిధిలోని అన్ని పరిశ్రమలకు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పని సరి

కౌడిపల్లి, అక్టోబరు15: జాతీయ పశువ్యాధుల నివారణలో భాగంగా మండలంలోని ప్రతీ గ్రామంలోని పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు ఇవ్వడం జరుగుతుందని పశువైద్యశాఖ మెదక్ జిల్లా ఇన్‌చార్జి వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లడుతూ ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం ద్వారా పశువులకు టీకాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కౌడిపల్లి పశువైద్యాధికారి రాజు, జేవీవో సుదర్శన్ పాని, ఎల్ఎస్ఎ వీరారెడ్డి, వెటర్నటి అసిస్టెంట్ చెన్నయ్య, ఓఎస్ సుజాత, లక్ష్మయ్య ఉన్నారు.

రేగోడులో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

డీఈవోకు విజ్ఞప్తి

రేగోడు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్ కోరారు. మంగళవారం మెదక్ డీఈవో రాధాకిషన్‌ను కలిసి రేగోడు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక రేగోడు మండలానికి అన్యాయం జరుగుతుందని, అధికారులు దృష్టి సాదించి భర్తీ చేయాలని తెలిపారు. ఇప్పటికే మండలంలో 60 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని, నూతనంగా నియమిస్తున్న ఉపాధ్యాయులను రేగోడుకు ప్రథమ ప్రాధాన్యం కల్పించి భర్తీ చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన డీఈవో రేగోడు ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల భర్తీ చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్..

ఖేడ్‌కు వరం

- నేడు పనులకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన
- 125 కోట్లతో భవనం నిర్మాణం
- 2500 మంది విద్యార్థులు.. 120 మంది అధ్యాపకులకు వసతుల కల్పన
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు మొదటివిడతలోనే మంజూరు



సిర్గాపూర్ మండలం వాసర్ సమీపంలో స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టింది. మెదక్ ఉమ్మడి జిల్లాలో నారాయణఖేడ్, ఆందోల్, నియోజకవర్గాలలో మొదటి విడతగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయడం గమనార్హం. ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాలను 25 ఎకరాలలో రూ.125 కోట్లతో నిర్మించనున్నారు. ఈ మేరకు ఈ నెల 16న రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో కులమతాలకతీతంగా, పేదధనిక తారతమ్యం లేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించనున్నారు. కంప్యూటర్ విద్యాబోధన కూడా ఉంటుంది. వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు నీట్, ఐఐటీ, ఎస్ఐటీల్లో ప్రవేశం పొందేందుకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

విద్యారంగం అభివృద్ధి కోసమే...

ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఖేడ్ నియోజకవర్గానికి వరం లాంటిది. ఈ ప్రాంతంలో పేద, మధ్య తరగతి పిల్లలు అధికసంఖ్యలో ఉంటారు. నిరుపేద కుటుంబాలవారి పిల్లలు ఉన్నతంగా ఎదగడం కోసం మొదటి విడతలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహలను కోరడంతో వారు సానుకూలంగా స్పందించి మంజూరు చేశారు. పాఠశాలను మొదటి విడతలోనే మంజూరు చేసినందుకు సీఎంకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

క్యాంపస్‌లో వసతులు ఇలా..

ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాన్ని 25 ఎకరాల విశాలమైన స్థలంలో నిర్మించనున్నారు. ఈ పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు వసతితో పాటు 120 మంది అధ్యాపకులు, అక్కడే ఉండే విధంగా నిర్మించనున్నారు. విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోర్డులతోపాటు కంప్యూటర్ ల్యాబ్‌లు, యాంప్ థియేటర్, ఆధునాతన సదుపాయాలు ఉంటాయి. 900 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేసే విధంగా భారీ డైనింగ్ హాల్, ఒక్కో గదిలో 10 మంది విద్యార్థులు ఉండే విధంగా బెడ్స్, ప్రతీ గదికి రెండు చొప్పున వాష్‌రూంలు నిర్మించనున్నారు. బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి సైతం సౌకర్యాలు క్యాంపస్‌లోనే కల్పిస్తారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల విద్యార్థులు కలిసి సోదర భావంతో విద్యాభ్యాసం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలలో అవసరమైన వసతులు, ఔట్‌డోర్ జిమ్, విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు సైతం ఆడిటోరియం నిర్మిస్తారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామస్థుల సన్మానం



జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న వాసర్ గ్రామస్థులు

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండలం వాసర్ సమీపంలో రూ.125 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేయించడంతో వాసర గ్రామస్థులు మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలను శాలువాతో ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతానికి గురుకులాన్ని మంజూరు చేయించినందుకు తాము ఎంతో రుణపడి ఉంటామన్నారు. అనంతరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో అశోక చక్రవర్తిని సైతం సన్మానించారు.

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ మంగళవారం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను వేర్వేరుగా కలిశారు. గాంధీ భవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా పీసీసీ అధ్యక్షుడితో పాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు రోహిత్‌రావును, నీలం మధును అభినందించారు.
- మెదక్/పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)







పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో పెండింగ్ దరఖాస్తులపై ఆయా మండల తహసీల్దార్లతో సమీక్షించారు. దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలను మండలాలవారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండెన్సీలో 3 వేల దరఖాస్తులు ఉన్నాయన్నారు. జూన్ 30 వరకు ఏవైతే పెండింగ్‌లో ఉన్నాయో వాటిని కలెక్టరేట్ సూపరింటెండెంట్‌తో సమన్వయం చేసుకొని ముగించాలన్నారు. ఇందుకు వారం గడువు ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను తిరస్కరిస్తే వాటికి గల కారణాలు స్పష్టంగా సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. కొన్ని సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరికొన్ని రెవెన్యూ డివిజనల్, ఇంకొన్ని కలెక్టరేట్ స్థాయిలో ఉన్న దరఖాస్తులపై పక్కా ప్రణాళికతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

రసాయన వ్యర్థాలపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు

జిన్నారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం పారిశ్రామికవాడలోని మూత పడిన పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థాల ప్రవాహంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానికంగా మూతపడిన ఓ పరిశ్రమ నుంచి వర్షపు నీటిలో కలిపి వ్యర్థాల రసాయన ప్రవాహం భారీగా జరిగింది. స్థానికులు పీసీబీ అధికారులకు సమాచారం అందించగా.. పరిశ్రమను సందర్శించిన అధికారులు శాంపిళ్లను సేకరించారు. వర్షపు నీటిలో రసాయన వ్యర్థాలు ప్రవహిస్తున్నాయని ఫిర్యాదు చేశారు.

ఆలుగడ్డ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



హుగ్గెల్లి రైతువేదికలో మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్త సరిత

జహీరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలుగడ్డ పంటసాగులో రైతులు విధిగా సమగ్రయాజమాన్య పద్ధతులు పాటించాలని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్తలు సరిత, రాహుల్‌విశ్వకర్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో రైతువేదిక వద్ద ఆలుగడ్డ పంటను సాగుచేసే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలుగడ్డ విత్తన ఎంపిక, సాగు, విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, కలుపుమొక్కల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు కార్యక్రమంలో జహీరాబాద్, మొగుడంపల్లి వ్యవసాయశాఖ అధికారులు లావణ్య, వినోద్‌కుమార్, ఏఈవో ప్రదీప్, పాల్గొన్నారు.

డీడీఎస్ కేవీకేలో మహిళాకిసాన్ దివస్

జహీరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో మహిళల ప్రాముఖ్యత అత్యవసరమని కేవీకే హెడ్, శాస్త్రవేత్త డా. వరప్రసాద్ పేర్కొ న్నారు. మంగళవారం మండలంలోని అల్గోల్-డిడిగి గ్రామాల శివారులో గల డీడీఎస్-కేవీకేలో మహిళాకిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కాగా విజయవాడకు చెందిన లయోలా ఉద్యాన కళాశాల విద్యార్థులు వివిధ రకాల వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు చేపట్టారు. పలువురు మహిళా రైతులను సన్మానించారు. కార్యక్రమంలో డా.మౌనిక(ఫలపరిశోధన స్థానం),బసంత్‌పూర్‌కు చెందిన డా.ఫాతిమ, డా.విజయలక్ష్మి, జహీరాబాద్ వ్యవసాయ అధికారి లావణ్య, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన



నిజాంపేటలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీబీపాటిల్

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఖేడ్ పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు నిజాంపేటలో మంగళవారం అవగాహన కల్పించారు. నిజాంపేటలో నిర్వహించిన కార్యక్రమంలోజహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి



మాట్లాడుతున్న అదిలాబాద్ ఎమ్మెల్యే, జోనల్ ఇన్‌చార్జి పాయల్ శంకర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో వేగం పెంచాలని అదిలాబాద్ ఎమ్మెల్యే, సభ్యత్వ నమోదు జోనల్ ఇన్‌చార్జి పాయల్‌శంకర్ సూచించారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో జిల్లా ముందుండాలని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికెళ్లి సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయ సమీపంలోని పలు ఇళ్లల్లో బీజేపీ సభ్యత్వాన్ని ఆయన స్వయంగా చేయించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్వాపురం లక్ష్మీనర్సయ్య, అసెంబ్లీ ఇన్‌చార్జి దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రేడియో వార్షికోత్సవం



మాచ్నూర్ రేడియో కేంద్రం వద్ద కేక్ కట్‌చేస్తున్న మహిళలు

ఝరాసంగం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మాచ్నూర్ గ్రామశివారులో గల దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంఘం రేడియో వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ సిబ్బంది కేకును కట్ చేసి స్వీట్లు పంచుకుని వార్షికోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సంఘం నిర్వాహకులు జనరల్ నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, పూలమ్మ తదితదరులు మాట్లాడుతూ సంఘం రేడియో ద్వారా వివిధరకాల పాటలతో ప్రజలను, రైతులను చైతన్యం చేస్తున్నామన్నారు.

నాయీ బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయి బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, రమేష్, శ్రీహరి, జిల్లా కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో మహిళ అదృశ్యం



ఎల్లమ్మ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం ముదిమాణిక్యంకు చెందిన ఓ మహిళ సంగారెడ్డిలో అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. ముదిమాణిక్యం గ్రామానికి చెందిన వడ్డే ఎల్లమ్మ (30) ఈనెల 9న సాయంత్రం ఆర్టీసీ బస్సులో ముదిమాణిక్యం నుంచి సంగారెడ్డికి వచ్చింది. తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె భర్త లక్ష్మణ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

మాసాయిపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ

మాసాయిపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాసాయిపేటలో తాళం వేసిన ఇంట్లో నుంచి నగదు చోరీ జరిగింది. బాదితులు చేగుంటపోలీసులను ఆశ్రయించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన పాపని శ్రీను దసరానాడు ఇంటికి తాళం వేసి తమ బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె ఇంట్లో బీరువా నుంచి రూ.2 లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ.. నగదు అపహరణ

టేక్మాల్ ,అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని కాదులూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి తాళం పగులగొట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించి వెంటనే ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు సమాచారం అందజేశారు. ఇది గమనించిన కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆలయంలోని హుండీలో సుమారు 70వేల రూ. దుండగులు ఎత్తుకుపోయినట్లు పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దసరా సెలవుల్లో పాఠశాలలో వస్తువులు ధ్వంసం

మనోహరాబాద్, అక్టోబర్(ఆంధ్రజ్యోతి)15: దసరా సెలవు దినాల్లో పాఠశాలలో వస్తువులు ధ్వంసం చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డి గ్రామంలో దసరా సెలవుల అనంతరం ప్రాథమిక పాఠశాలకు వెళ్లి చూడగా తాళం వేసిన గేటు, డోరు తాళాలపై కెమికల్ పోసి ఉంది. దీంతో తాళాలలను పగలగొట్టి తలుపులను తీసినట్లు తెలిపారు. పాఠశాలలో నీటి పైపులను దుండగులు ధ్వంసం చేశారన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం సాయంత్రం ఫాంహౌస్‌లో ఉన్న మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నాయకులు ఉన్నారు.

నేడు గర్భణ్యాస కౌముది వ్రత మహోత్సవం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఈ నెల 16న గర్భన్యాస కౌముది వ్రత మహోత్సవం నిర్వహించనున్నట్టు జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిద్ధాంతి మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు గర్భన్యాస కార్యక్రమాన్ని 250 ద్రవ్యాలతో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు నుంచి 12 గంటల వరకు కౌముది వ్రత మహోత్సవం జరుగుతుందన్నారు.

కాసాలలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

హత్నూర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసాల గ్రామంలో శ్రీ దుర్గమ్మ తల్లి పునఃప్రతిష్ఠ ఉత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, భక్తుల భజనలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారంశ్రీ దుర్గమ్మ తల్లి, ఊరడమ్మతల్లి అమ్మవారుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు బస్టాండ్ లేక ఇబ్బందులు

కొల్చారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వన దుర్గామాత దర్శనం కోసం నిత్యం వందలాది మంది భక్తులు బస్సులలో ఇక్కడ దిగి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తూ ఉంటారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో బస్టాండ్ వద్ద చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే వర్షంలో తడవాల్సిందే. ఎండాకాలంలో కూడా ఇబ్బందులే. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

'ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి'

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డితో కలిసి నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేట గ్రామాన్ని సందర్శించారు. కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కలుషిత నీటికి కారణమైన బావిని పరిశీలించారు. మృతి చెందిన సాయమ్మ, మహేష్ కుటుంబీకులకు రూ.50 వేల చొప్పున నగదు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌మారుతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపొద్దు

- సంగారెడ్డి కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ లేఖ

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికలో వివక్ష చూపొద్దని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలు పార్టీలకు అతీతంగా అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. కానీ కొన్ని మండలాల్లో అధికార పార్టీకి చెందిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు హైదరాబాదుకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



సంగారెడ్డిలోని తారా కళాశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



పటాన్‌చెరు: ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



గుమ్మడిదల: బొంతపల్లిలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు విద్యాసంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అబ్దుల్‌కలాం ఆశయాలు నేటి యువతరానికి ఆదర్శమని కొనియాడారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో అబ్దుల్ కలాం కాంస్య విగ్రహం వద్ద ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నారాయణఖేడ్‌లోని ఆక్సిజన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామ పరిధిలో వివేకానంద స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సహా మరో 40 మంది పాల్గొని రక్తదానం చేశారు. టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లి చౌరస్తాలో మెదక్ జిల్లా మత్స్యశాఖ సంఘ డైరెక్టర్ భవాని అంజయ్య, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ చీలపల్లి రవిశంకర్, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ కునదొడ్డి శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.